క్లుప్తంగా

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బారావు

అగళి: ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా అందజేయాలని తహసీల్దార్ సుబ్బరావు ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ప్రజలకు రేషన్ సరుకులు అందించాలన్నారు. బయోమెట్రిక్ తీసుకుని సరుకులు ఇవ్వకపోవడం, తూకంలో తక్కువ సరుకులు ఇవ్వడం వంటి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు రేషన్ సరుకులను ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ భాగ్యలక్ష్మి, మండల డీలర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఒంటి పాళ్యం గ్రామానికి చెందిన రంగప్ప ఆస్తి తగాదాలతో మనస్థాపానికి గురై శనివారం ఇంటి సమీపంలో విష ద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే రంగప్పను చికిత్స నిమిత్తం మడకశిర ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రంగప్ప ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి



జ్యోతి ప్రజల్వన చేస్తున్న కృష్ణమూర్తి

పావగడ: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను నేటి యువత కొసాగించాలి. అతడి అడుగుజాడల్లో నడవాలని బీఎస్పీ కర్ణాటక రాజ్యాధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శనివారం తాలూకాలోని సాసలకుంట గ్రామంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజ్యాంగం కేవలం ఎస్సీ, ఎస్టీలకే కాకుండా బీసీలు, మైనార్టీలు, ఓబీసీలకు సైతం రిజర్వేషన్లలో వాటా కల్పించారని తెలిపారు. అయితే కొన్ని వర్గాల వారు అంబేడ్కర్‌ను విస్మరిస్తుండటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాజ్య కార్యదర్శి శూలయ్య, రుద్రప్ప, శివకుమార్ బెల్లదముడు, గోపాల్ అణ్ణేనహళ్లి, తుమకూరు జిల్లాధ్యక్షుడు అంజనమూర్తి, పావగడ తాలూకా అధ్యక్షుడు ఎస్ తిప్పేస్వామి, కొరటగెరె తాలూకా అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం 'సీఎంఆర్ఎఫ్'



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: అనారోగ్యానికి గురైన పేదలకు సీఎంఆర్ఎఫ్ ఓ వరం లాంటిది అని మంత్రి సవిత తెలిపారు. శనివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల మండలాలకు చెందిన పలువురికి రూ.13 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో పలువురు వ్యాపారులకు తోపుడు బండ్లు, ఇస్త్రీ పెట్టెలు, టిఫిన్ బండ్లు అందజేశారు.

11 గంటలైనా తెరచుకోని ఆర్బీకే



ఆర్బీకే వద్ద గోడకు వినతిపత్రం అతికిస్తున్న సీపీఎం నాయకులు

సోమందేపల్లి: మండల కేంద్రంలో శనివారం రైతు భరోసా కేంద్రం, ఏఓ కార్యాలయం 11 గంటలైనా తెరచుకోక పోవడంతో సీపీఎం నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఆర్బీకే సిబ్బంది కూడా విధులకు హాజరుకాలేదు. రైతులకు 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన వేరుశనగ ఇవ్వాలని కోరుతూ ఆర్బీకే వద్దకు చేరుకున్న సీపీఎం నాయకులు.. అధికారులు ఎవరూ లేకపోవడంతో గోడకు వినతిపత్రం అతికించారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమయ్య, వెంకటేష్, పెద్దన్న, రామకృష్ణ, కిష్టప్ప, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన దారులు
ఎన్నాళ్లీ అవస్థలు?



కంకర తేలి ప్రమాదకరంగా ఉన్న అమరాపురం-విరుపసముద్రం రోడ్డు

- విరుపసముద్రం నుంచి అమరాపురం వరకు రోడ్డు గుంతలమయం
- రోడ్ల గురించి పట్టించుకోని ప్రభుత్వం
- వాహనదారులకు నరకయాతన
- ప్రమాదాలకు గురవుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



తమ్మడేపల్లి వద్ద గుంతలు పడిన రోడ్డు

అమరాపురం: మండల పరిధిలోని కర్ణాటక బార్డర్ విరుపసముద్రం నుంచి అమరాపురం వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణించే వారికి నరకయాతన తప్పడం లేదు. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే అటు ద్విచక్ర వాహనాదారులు, కార్లు, లారీలు, బస్సులు నడిపే డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమరాపురం నుంచి తమ్మడేపల్లి, వలస గేట్, విరుపసముద్రం వరకు ఉన్న రోడ్డులో కంకర తేలండంతో గుంతలు ప్రమాదకరంగా మారాయి. ప్రయాణం ఏ విధంగా చేయాలోని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంతలు లేని సుందరమైన రోడ్లు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా.. ఇంతవరకూ రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. నూతన రోడ్లు కాదు.. కనీసం గుంతల్లో మట్టి కూడా వేయించలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ మార్గంలో దాదాపు 10 కిలోమీటర్ల రోడ్డు గుంతలు పడటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని డ్రైవింగ్ చేయాల్సి వస్తుందని వాహనదారులు చెబుతున్నారు. అదేవిధంగా ఈ రోడ్డులో ప్రయాణించే వాహనాలు అదుపు తప్పి కిందపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. నిత్యం అమరాపుం నుంచి అనంతపురం, దావణగెర, చిత్రదుర్గం, చెళ్లికెరకు వెళ్లాలంటే ఈ మార్గం తప్ప వేరే దారి లేదు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని అమరాపురం నుంచి విరుపసముద్రం బార్డర్ వరకు తారు రోడ్డు వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిత్యం నరకమే



మా స్వగ్రామం దేవగానపల్లి. నేను రోజూ ఈ రోడ్డులో ప్రయాణం చేయక తప్పడం లేదు. తెల్లవారితే పని మీద అమరాపురం, కళ్యాణదుర్గం వెళ్లాల్సి ఉంటుంది. నేను ద్విచక్ర వాహనంలో వెళ్తున్నప్పుడు చాలాసార్లు నా బండి పంచర్ అయ్యింది. ద్విచక్ర వాహనం కూడా రిపేరి అవుతోంది. మా అవస్థలు దేవుడికెరుగు. ప్రభుత్వం మొదట రోడ్డును బాగు చేయించాలి.

– మంజునాథ, ప్రైవేటు ఉద్యోగి, దేవగానపల్లి

అభివృద్ధి శూన్యం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి 11 నెలలు కావస్తోంది. మండలంలో అభివృద్ధి జరగలేదు. కనీసం అమరాపురం నుంచి విరుపసముద్రం వరకు రోడ్డు నిర్మాణం చేయలేదు. ఇచ్చిన హామీ ప్రకారం రోడ్డు వేయాలి. ఈ రోడ్డులో ప్రయాణం చాలా కష్టం. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికే పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి.

– భీరలింగప్ప, వి.అగ్రహారం

తారు రోడ్డు వేయాలి



మాది నగోనపల్లి గ్రామం. నిత్యం నగోనపల్లి, దేవగాన పల్లి ప్రజలు అమరాపురానికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే తమ్మడేపల్లి నుంచి అమరాపురం వెళ్లాలంటే రోడ్డు అధ్వానంగా ఉంది. అమరాపురం వెళ్లాలంటే 15 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. అంటే రోడ్డు గుంతలలో పాటు కంక తేలడంతో ఇబ్బందిగా వుంది. సంబంధింత ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని తారు రోడ్డు వేయాల్సిన అవసరం ఉంది.

– సిద్దేశ్వర, నగోనపల్లి

వసతి బడుల్లో ఉత్తమ విద్యా బోధన



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో అధికారులు, తదితరులు

పావగడ: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతి పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన లభిస్తుంది. హాస్టల్ వసతి ఉండటంతో వేళకు భోజనం, వార్డన్లు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ, మొబైళ్ల నిరాకరణ తదితర అంశాలు విద్యార్థుల విద్యాభ్యాసానికి దోహదపడుతాయని మాజీ ఐఏఎస్ అధికారి ఈ.వెంకటయ్య తెలిపారు. శనివారం స్థానిక నూతన అంబేడ్కర్ భవనంలో సూరపనేని విద్యాసాగర్ ఫౌండేషన్, కర్ణాటక వసతి విద్యా సంస్థల సంఘం, హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వసతి పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సూరపనేని విద్యా సాగర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విద్యాసాగర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎంతో అవసరమన్నారు. కర్ణాటక వసతి విద్యా సంస్థల పర్యవేక్షకుడు నాగేశ్ మాట్లాడుతూ.. తాలూకా వ్యాప్తంగా ఉన్న 8 ప్రభుత్వ వసతి పాఠశాలల విద్యార్థులు 80 శాతం ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ వసతి పాఠశాలలకు చెందిన 183 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కరాలు, పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల నిర్వాహకుడు ఎన్సీ నాగభూషణ, నరేశ్, శశి కిరణ్, సత్యలోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ శాంతి

హిందూపురం టౌన్: విద్యార్థులు సమతుల ఆహారం తీసుకుని శారీరకంగా, ఆరోగ్యంగా ఎదగాలని సీడీపీఓ శాంతి సూచించారు. శనివారం పట్టణంలోని త్యాగరాజ్ నగర్‌లో ఉన్న మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాలలో సాయికళ, మాళప్ప దంపతుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత వేసవి బడిలో భాగంగా కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, మహిళలపై అఘాయిత్యాలు, నేరాలను అరికట్టే దిశగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, నేరాలు, అఘాయిత్యాలు సంబంధిత కేసుల నమోదు శాతాన్ని '0' స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ విలువలను పెంపొందించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. టీనేజ్ బాలికలపై వారి చుట్టూ ఉన్న వారి ప్రభావం అధికంగా ఉంటుందని.. ఈ వయస్సు బాలికలకు శారీరక, మానసిక స్థితిపై అవగాహన కల్పించాలన్నారు. అందుకోసం క్షేత్ర స్థాయిలో మనకు చేరువలో ఉన్న మహిళా పోలీసు, ఐసీడీఎస్ శాఖకు సంబంధించిన కౌన్సిలర్లు మీ ప్రాంతాలలో కిశోరి బాలికలతో ఒక గ్రూపు తయారు చేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేయాలని సూచించారు. బాలికలతో స్నేహపూర్వకంగా ఉంటూనే వారి శారీరక, మానసిక స్థితిగతులపై వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయమ్మ, అనిత, సరస్వతి, మహిళా పోలీసులు విజయభారతి, అనీల, మాళప్ప, సాయికళ, అంగన్వాడీ కార్యకర్త తసీన, ఉపాధ్యాయులు కుమారి, మమత, సిరి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



జవహర్ నవోదయ విద్యాలయలో యోగా చేస్తున్న అభ్యాసకులు



అమరాపురం: యోగా సాధన చేస్తున్న దృశ్యం

అమరాపురం: ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని కార్యదర్శి ఈరన్న తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ యోగా సాధన చేయాలన్నారు. తద్వారా మనశ్శాంతితో పాటు మనం చేసే పనిపై ఏకాగ్రత ఉంటుందని పేర్కొన్నారు. యోగాను దినచర్యగా మార్చుకోవాలని సూచించారు. యోగా చేస్తే రోగాలు దరి చేరవని తెలిపారు.

జవహర్ నవోదయ విద్యాలయలో..

లేపాక్షి: ప్రజలు యోగా అభ్యసనం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. శనివారం ఉదయం లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. యోగాతో ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మానసిక ఒత్తిడి తగ్గిపోతుందని తెలిపారు.

తెగిన కల్వర్టు..
రాకపోకలకు ఇబ్బందులు



బీజీ హళ్లి హొసకట్ట వద్ద పూర్తిగా తెగిపోయిన కల్వర్టు

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి పంచాయతీ కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డులోని హొసకట్ట వద్ద 20 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు తెగిపోయింది. బీజీహళ్లి-భైరేపల్లి క్రాస్ నుంచి ఈ మార్గంలో బీజీ హళ్లి పంచాయతీ కేంద్రంతో పాటు హునిసేకుంట, చర్లోపల్లి, ఎం.రాయాపురం, ఎంఆర్ గొల్లహట్టి, సోమఘట్ట, సీఎం ఘట్ట పలు గ్రామాలకు ప్రజలు, అధికారులు రాకపోకలు సాగిస్తున్నారు. కల్వర్టు పూర్తిగా తెగిపోవడంతో బీజీ హళ్లి సచివాలయానికి వెళ్లే ఉద్యోగులు, వివిధ పని నిమిత్తం వెళ్లే ప్రజలు పక్కనే ఉన్న హొసకట్ట వంకలో దిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసి హొసకట్టలోకి నీరు చేరితే రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యే అవకాశం ఉంది. సమస్యను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన కల్వర్టు నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

నేడు వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పెనుకొండ: శ్రీసత్యసాయి జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు వాల్మీకి ఉద్యోగుల కమిటీ జిల్లా కార్యదర్శి శివయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని స్థానిక మిట్టాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పురస్కారాల కోసం విద్యార్థుల జాబితాను సిద్ధం చేయడం జరిగిందన్నారు. అర్హత ఉండి పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులందరూ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

ఖైదీల్లో మార్పు రావాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం: క్షణికావేశంలో తప్పులు చేసి శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో మార్పు రావాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో గదులు, మరుగుదొడ్లు, వంటగది, నిత్యావసరాలు ఇతర సౌకర్యాలను పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చేసిన నేరం, ఎంతకాలంగా శిక్ష అనుభవిస్తున్నారు? ఖైదీలకు ఇస్తున్న ఆహారం నాణ్యత తదతర వివరాలపై ఆరా తీశారు. జైలు అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారా, వైద్య సౌకర్యాలు అందుతున్నాయా? అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సబ్‌జైలులో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడారు. తప్పు చేసి జైళ్లకు రావడం వల్ల సమాజంలో కుటుంబ సభ్యుల గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లుతుందన్నారు. సబ్‌జైలులో ఫిర్యాదుల పెట్టె సక్రమంగా లేదని.. వెంటనే ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని జైలర్ హనుమన్నను ఆదేశించారు. ఖైదీల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకుంటూ ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన ఖైదీలు ఉంటే బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాంటి వారికి ఉచిత న్యాయ సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కళావతి, పార్వతి, భరత్ సింహా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల ఢీ: ఒకరికి గాయాలు



వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెళ్లికెరె క్రాస్‌లో కేఎస్ ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో బొలెరో వాహనంలో ఉన్న బెస్తరపల్లి గ్రామానికి చెందిన రామాంజినప్ప అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాద సంఘటన శనివారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. క్షతగాత్రుడికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే అదృష్టవశాత్తూ రెండు వాహనాల్లో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. డ్రైవర్లు ఇద్దరు క్షేమంగా ఉన్నారు. బస్సులో ప్రయాణికులను బస్టాండులో దింపేసి డిపోకు వెళ్లే సందర్భంలో ఎదురుగా వేగంగా వస్తున్న బొలెరో వాహనం బస్సును ఢీకొన్నట్లు సీఐ సురేశ్ తెలిపారు. రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని సంఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	32.0
పెనుకొండ	35.0
మడకశిర	32.0

ప్రజల భద్రతకు పెద్దపీట



మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

హిందూపురం టౌన్: హిందూపురం పట్టణ ప్రజల భద్రత ముఖ్యమని డీఎస్పీ మహేష్ అన్నారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో సీఐలు, ఎస్ఐలతో కలసి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో వినాయక శోభాయాత్ర అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. అయితే గత సంవత్సరం శోభాయాత్రలో రెండు పెద్ద విగ్రహాలు పడిపోవడం జరిగిందని గుర్తు చేశారు. అయితే అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు జాయింట్ కలెక్టర్‌తో కలసి పట్టణంలో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా వినాయక విగ్రహాల ఎత్తును తగ్గించేలా అందులో చర్చించడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే త్వరలోనే వినాయక మండప నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించడం చర్చించడం జరుగుతుందన్నారు. నిర్వాహకులు కూడా ఎక్కువ ఎత్తులో విగ్రహాలను ఏర్పాటు చేయరాదని సూచించారు. ప్రజల భద్రత, ఊరేగింపు సాగే రోడ్లు తదితర వాటిని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. వినాయక ఉత్సవం వైభవంగా సాగేలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు వినాయక మండప నిర్వాహకులు సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మడకశిర రూరల్: అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మడకశిర పట్టణానికి చెందిన టీఎస్.బాబన్న (50) శనివారం మృతి చెందాడు. పది రోజుల క్రితం మండల పరిధిలోని బుళ్లసముద్రం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. బాబన్న తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయామని.. తాము ఎలా జీవనం సాగించాలని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈయన మృతితో ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాలనీవాసులు కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



మంటల్లో కాలిపోతున్న ద్విచక్ర వాహనం

లేపాక్షి: చోళసముద్రం సమీపంలోని జాతీయ రహదారిలో శనివారం సాయంత్రం బజాజ్‌ప్లాటినా (ద్విచక్ర వాహనం) దగ్ధమైంది. వివరాలు.. కొడికొండ-శిరా 544ఈ నంబర్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అకస్మాత్తుగా సైడ్ బ్యాగ్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన ద్విచక్ర వాహనదారుడు కిందకు దిగడంతో ప్రమాదం తప్పింది. దగ్ధమైన వాహనం కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి చెందిన రామక్రిష్ణకు చెందినట్లుగా పోలీసులు గుర్తించారు. మరిన్ని వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు

రొళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలు మొదలుకుని అంకురార్పణ, అష్టోత్తర నామాలు, విష్ణుసహస్ర నామాలు, తులసీ పూజ చేశారు. అనంతరం లక్ష్మీదేవి సమేతంగా నరసింహస్వామికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులు కానుకల రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, పూలతో పాటు వెండి, బంగారు ఆభరణాలతో స్వామిని అలంకరించారు. కర్ణాటక ప్రాంతాల నుంచి స్వామిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందించారు. భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.